

స్టేషన్‌ఘన్‌పూర్‌లో పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

స్టేషన్ ఘన్‌పూర్, మే 12 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కోరారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని బాలికల హైస్కూల్‌లో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్‌శాతం పెంచేందుకు ఇప్పటికే మండలాల్లో విస్తృత స్థాయి అవగాహన సదస్సులు నిర్వహించామని ఆయన తెలిపారు. ఓటరు స్లిప్ అందని వారు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా, లేదా 1950 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో డీఎస్ వెంకన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, సదానందం, ఎలక్షన్ డీటీ రాజేశ్‌కుమార్, డీటీ విజయకుమార్, ఆర్ఐ అర్జున్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి రూరల్ : పాలకుర్తి నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తెలిపారు. నియోజక వర్గంలో 296 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో 43 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. పోలింగ్ నిర్వహణకు 353 మంది పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పీవోలు 353 మంది, ఓపీఓలు 706 మందిని నియమించామన్నారు. నియోజకవర్గంలో 1500 మంది పోలీసులను బందోబస్తుకు వినియోగిస్తున్నట్లు వారు వివరించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. వారి వెంట వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐలు గట్ల మహేందర్‌రెడ్డి, టీ సంజీవ్, ఎస్సైలు తదితరులు ఉన్నారు.

జనగామలో మాట్లాడుతున్న డీసీపీ సీతారాం

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

జనగామ డీసీపీ సీతారాం

జనగామ చౌరస్తా, మే 12 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జనగామ డీసీపీ పీ సీతారాం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏసీపీ అంకితకుమార్‌తో కలిసి ఆయన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు కృషి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పారదర్శకంగా విధులు నిర్వర్తించి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని సీతారాం కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి, ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుల్స్, హోంగార్డులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి ..

స్టేషన్ ఘన్‌పూర్ : అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జనగామ డీసీపీ పీ సీతారాం పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆదివారం మండలంలోని శివునిపల్లిలో ఏర్పాటు చేసిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ స్థాయి పోలీసుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీసులు కృషి చేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలను గుంపులుగా ఉండకుండా చూడాలన్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ ఆర్ భీంశర్మ, సీఐలు ముస్క రాజు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఎస్సైలు నాగరాజు, వినయ్‌కుమార్, శీలం రవి పాల్గొన్నారు.

జనగామలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది

జనగామ పట్టణంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సామగ్రితో తరలివెళ్తున్న సిబ్బంది

నేడే పోలింగ్..

- పార్లమెంట్ ఎన్నికలకు సిర్వం సిద్ధం
- స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటింగ్ జరిగేలా ఏర్పాట్లు పూర్తి
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- జిల్లాలోని ఓటర్ల సంఖ్య 7,52,395
- జనగామ సెగ్మెంట్‌లో ఓటర్లు 2,42,771 మంది
- స్టేషన్‌ఘన్‌పూర్ సెగ్మెంట్‌లో ఓటర్లు 2,54,110 మంది
- పాలకుర్తి సెగ్మెంట్‌లోని ఓటర్లు 2,55,514 మంది

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద సిబ్బంది

జనగామ, మే 12 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్‌కు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. జిల్లాలోని జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో సోమవారం నిర్వహించనున్న పోలింగ్‌కు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 869పోలింగ్ కేంద్రాల్లో 7,52,395 మంది ఓటర్లు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 3,71,112 మంది, మహిళలు 3,81,258 మంది, థర్డ్ జండర్ ఓటర్లు 25 మంది ఉన్నారు. వీరిలో జనగామ సెగ్మెంట్‌లో మొత్తం ఓటర్లు 2,42,771 మంది ఉండగా, పురుషుల సంఖ్య 1,19,491 మంది, మహిళల సంఖ్య 1,23,270 మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు 10మంది ఉన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ సెగ్మెంట్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 2,54,110 మంది. వీరిలో పురుషుల సంఖ్య 1,25,210 మంది, మహిళల సంఖ్య 1,28,898 మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు ఇద్దరు ఉన్నారు. పాలకుర్తి సెగ్మెంట్‌లో మొత్తం ఓటర్లు 2,55,514 మంది. వీరిలో పురుషులు 1,26,411 మంది, మహిళలు 1,29,090 మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు 13 మంది ఉన్నారు. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లోని లొకేషన్ల నుంచి వెబ్‌క్యాస్టింగ్ (లైవ్) ద్వారా పోలింగ్ జరుగుతుంది. శాంతిభద్రతల దృష్ట్యా జిల్లాలోని మిగిలిన అన్ని పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుంది. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల అధికారులు సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. పోలీసు భద్రత మధ్య పోలింగ్ నిర్వహించేందుకు పెద్దఎత్తున బలగాలను మోహరించారు. ఓటింగ్ సరళిని మొత్తం సీసీ కెమెరాలో రికార్డు చేయనున్నారు. ఎన్నికల విధుల్లో పీవో, ఏపీవో, ఓపీవోలు ఇప్పటికే ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఈవీఎంలు, వీవీప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేసి బందోబస్తు మధ్య ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ప్రతి ఓటరుకు ఎపిక్‌కార్డుల పంపిణీ పూర్తి చేసి, నమోదు చేసుకున్న 80 ఏండ్లు దాటిన వృద్ధులు, పీడబ్ల్యూడీ (దివ్యాంగుల) ఓటర్లకు హోం ఓటింగ్ పూర్తి చేశారు. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ఓట్లు వేసేందుకు పోస్టల్ ఓటింగ్ అవకాశం కల్పించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన టెంట్లు, తాగునీరు, వైద్యంతో పాటు అన్ని సౌకర్యాలను కల్పించారు. నేడు పోలింగ్ ముగిసిన తర్వాత పోలింగ్ కేంద్రాల నుంచి ఆర్వో కేంద్రాలకు తరలించి అక్కడ స్వీకరించిన తర్వాత అదే రాత్రి మూడు నియోజకవర్గాల ఈవీఎంలను ఆయా పార్లమెంట్ సెగ్మెంట్ వారీగా కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తారు. ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులతోపాటు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా పరిశీలించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో భారీ బందోబస్తు

జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో పోలీస్ బలగాలతోపాటు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కేంద్ర బలగాలను రంగంలో దింపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక పోలీసులను కూడా బందోబస్తులో వినియోగించుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన గ్రామాలను ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రత చర్యలు చేపట్టారు. ఇదే కాకుండా స్ట్రైకింగ్ ఫోర్స్ కూడా అందుబాటులో ఉంచారు. ఎక్కడ ఎలాంటి ఘటన జరిగినా వెంటనే చేరుకునేలా అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. మరోపక్క సమస్యాత్మక కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్, మిగిలిన కేంద్రాల్లో సీసీ కెమెరా పర్యవేక్షణలో ఓటింగ్ నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అవసరమైతే 144సెక్షన్ అమలు చేస్తామని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలోనే నిలిపి పార్టీ కండువాలు లేకుండా ప్రచారం చేయకుండా చర్యలు చేపట్టారు. పోలింగ్‌కు సర్వం సిద్ధం కావడంతో ఆఖరి నిమిషం వరకు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు మునిగిపోయారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్ : పోలింగ్ బూత్‌లకు వెళ్తున్న సిబ్బంది

జనగామ నుంచి పోలింగ్ బూత్‌లకు వెళ్తున్న సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్ : ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది

జనగామలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

దేవరుప్పులలోని పోలింగ్ కేంద్రం

జనగామ రూరల్ : శామీర్‌పేట పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది

ఎన్నికల నిర్వహణకు భారీ బందోబస్తు : ఏసీపీ

స్టేషన్ ఘన్‌పూర్, మే 12 : పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ ఆర్ భీంశర్మ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంతోపాటు చాగల్లు, ఇప్పగూడెం, తాటికొండ, శివునిపల్లి గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఇద్దరు ఏసీపీలు, ముగ్గురు సీఐలు, 25 మంది ఎస్సైలు, 32 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్ , 24 మంది టీఎస్పీ ఫోర్స్ , మామూనూర్ క్యాంపులో శిక్షణ పొందుతున్న మహిళా పోలీసులు 185 మంది, హోం గార్డులు 68 మంది, బీఎస్ఎఫ్‌కు సంబంధించిన ఎనిమిది కంపెనీలతో కలిపి మొత్తం 455 మంది పోలీస్ సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారని భీంశర్మ తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసేలా చర్యలు చేపట్టామన్నారు.

జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఈదురు గాలులతో వర్షం

స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం రాత్రి కురుస్తున్న వర్షం

జనగామ చౌరస్తా/స్టేషన్ ఘన్‌పూర్, మే 12 : ఉరుములు, మెరుపులతో జిల్లా కేంద్రంతోపాటు స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, చిల్పూరు మండలాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. కొన్ని గంటల్లో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఉన్న నేపథ్యంలో ఈదురు గాలులు వీచాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలోకి నీళ్లొచ్చాయి. ఎండల నేపథ్యంలో నీడ కోసం వేసిన టెంట్లు తడిశాయి. ఒక వేళ మధ్యాహ్నం సమయంలో వర్షం కురిస్తే పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఈవీఎంలతో వెళ్లడం ఇబ్బందికరంగా ఉండేదని ఎన్నికల అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా నేడు పోలింగ్ ముగిసిన అనంతరం సాయంత్రం డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఎన్నికల సిబ్బంది రావాల్సి ఉంది. ఈ రోజు కూడా వర్షం కురిస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

క్రీడాకారులతో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

ఫెడరేషన్ కప్‌లో విద్యార్థినుల ప్రతిభ

బచ్చన్నపేట, మే 12 : జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో తెలంగాణ నుంచి హాజరైన విద్యార్థినులు ప్రతిభ చూపారు. గోవాలో ఈ నెల 10నుంచి 12వరకు జరిగిన పోటీల్లో అండర్-12 బాలికల విభాగంలో రజతం, అండర్- 17 బాలుర విభాగంలో బ్రాన్జ్, అండర్-19 బాలురు రజత పతకం గెల్చుకుని రాష్ట్ర ఖ్యాతిని చాటారు. వీరికి కోచ్ నసీర్, మేనేజర్ హేమ ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ బాడీ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి క్రీడాకారుల తల్లితండ్రులను అభినందించారు. భవిష్యత్‌లోనూ క్రీడల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

రమేశ్ (ఫైల్)

లచ్చమ్మ (ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్, మే 12 : వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటనలు ఆదివారం మండలంలో వెలుగు చూశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన గోనెల రమేశ్ (52) అలియాస్ గోనెల రాజన్న ఆదివారం ఉదయం వ్యవసాయ పనుల కోసం స్కూటీపై వెళ్తుండగా, హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న టీఎస్ 24 టీఆర్ 2957 నంబరు గల కారు అతివేగంగా వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని ఛాగల్‌కు చెందిన చెరుకు లచ్చమ్మ (70) ఆదివారం రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొంది. దీంతో లచ్చమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముస్క రాజు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న శివకుమార్‌గౌడ్

బచ్చన్నపేట, మే 12 : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన సొప్పరి నర్సయ్య ఆనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేత, సామాజిక సేవా కార్యకర్త కోడూరి శివకుమార్ గౌడ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ పేదలకు తనవంతు సాయం అందించడమే ధ్యేయమన్నారు. ఆయన వెంట యాట సత్తయ్య, చంద్రయ్య, మహేశ్, కనకయ్య, వెంకటయ్య,శ్రీనివాస్ , భాస్కర్, కమలాకర్ పాల్గొన్నారు.

దేవరుప్పుల పోలింగ్ కేంద్రానికి వస్తున్న సిబ్బంది

బచ్చన్నపేట : తమ్మడపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కొమురయ్య

నర్మెటలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

జనగామ రూరల్ : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఉప్పగల్లు సంపత్‌కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని సిద్దెంకి, శామీర్‌పేట పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు ఇప్తికారుద్దీన్, మధు, పాల్గొన్నారు.

దేవరుప్పలలో..

దేవరుప్పుల : వరంగల్ పార్లమెంట్ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో మండలంలోని 22 గ్రామాల్లో 41పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. సోమవారం 36,624మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో మహిళలు 18,339 మంది, పురుషులు 18,285 మంది ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు 205మంది పోలింగ్ సిబ్బంది, 80మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ఇప్పటికే బీఎల్‌వోలు గ్రామాల్లో పోల్ చిట్టీలు పంపిణీ చేయగా, ఓటర్లు సోమవారం ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

లింగాలఘనపురంలో పోలింగ్ కేంద్రానికి చేరిన ఎన్నికల సబ్బంది

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : ఎన్నికల నిర్వహణకు మండలంలోని 47 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి వసతులు కల్పించామన్నారు. పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. బీఎల్‌వోలు దగ్గరుండి సిబ్బందికి సహకారం అందించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు.

లింగాలఘనపురంలో..

లింగాలఘనపురం : మండలంలోని 21 గ్రామాల పరిధిలోని మొత్తం ఓటర్లు 32,701 ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు 38 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వినయలత తెలిపారు. ఏనెబావి, మంథోనిగూడెం ఓటర్ల కోసం మాణిక్యపురంలో, రామచంద్రగూడెం ఓటర్ల కోసం జీడికల్‌లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా అధికార యంత్రాంగం ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించింది.

నర్మెటలో..

నర్మెట : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలకు ఆదివారం సాయంత్రం సిబ్బంది పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. మండలంలో 22 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రాలకు అభ్యర్థుల ఏజెంట్లు హాజరుకావాలని ఎన్నికల అధికారులు సూచించారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు వారి ముందే ఆయా పోలింగ్ కేంద్రాల్లో మాక్‌పోలింగ్ నిర్వహించనున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, the undersigned RONDLA SRIKAR REDDY (New Name), previously called RONDLA S REDDY (Old Name), and residing at # H.No. 1-1-490/1/111/402, Rachana Nilayam, Chaithanya Puri Colony, Warangal-Hanumakonda - 506004.
NTW-00

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-323227

RECRUITMENT

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565